# సాక్షి నంద్యాల

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025






## ..సమ్మెను విజయవంతం చేద్దాం

వచ్చే నెల 24, 25 తేదీల్లో చేపట్టే ఆలిండియా బ్యాంకుల సమ్మెను విజయవంతం చేద్దామని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నేతలు పిలుపునిచ్చారు. 8లో▸



## అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన పూజా డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



## భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు.

## న్యూస్‌రీల్

### నాణ్యత పాటించకపోతే చర్యలు



వంటగదిని పరిశీలిస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

మహానంది: విద్యార్థినులకు వండే ఆహార పదార్థాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి హెచ్చరించారు. తిమ్మాపురంలోని కేజీబీవీలో ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులు తీసుకునే రాగిజావ, అల్పాహారం పరిశీలించారు. వారితో పాటే కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంటగదితో పాటు వంట పాత్రలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ విడుదల చేసిన 100 రోజుల ప్రణాళికను తప్పకుండా పాటించాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల స్టడీ అవర్‌ను పరిశీలించి ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### మహానందీశ్వరుడి సన్నిధిలో ..



దర్శనార్థం వచ్చిన ఎండీ హరిప్రసాద్

మహానంది: డీఆర్‌డీఓ శ్రీనిధి రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ శుక్రవారం మహానందిలో పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం శ్రీనివాసులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. దర్శనం తర్వాత స్థానిక అలంకార మండపంలో వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

### ముమ్మరంగా రైతుల రిజిస్ట్రేషన్

- నంద్యాల జిల్లాలో 35,598 నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతులకు ఆధార్ తరహాలో 11 అంకెలతో కూడిన ప్రత్యేక నెంబరును కేటాయించే ప్రక్రియ ఊపందుకుంది. కర్నూలు, నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్ (ఏపీఎఫ్ఆర్)లో రైతులను రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. కర్నూలు జిల్లాలో 2,52,624 మంది రైతులు ఉండగా...రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలు 39,373 మందిని ఎన్‌రోల్‌మెంటు చేశారు. నంద్యాల జిల్లాలో 2,03,291 మంది రైతులు ఉండగా.. 35,598 మంది రైతులను నమోదు చేశారు. ఆధార్‌లో పేర్ల వివరాలు, ఆర్‌వోఆర్‌లోని వివరాలు 80 శాతం వరకు సరిపోతే రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి పరిధిలోనే 11 అంకెల యూనిక్ ఐడీ నెంబరు జారీ అవుతోంది. ఆధార్, ఆర్‌వోఆర్‌లోని వివరాలు 80 శాతం వరకు సరిపోకపోతే అటువంటి వాటిని వీఆర్‌వో లాగిన్‌కు అప్‌లోడ్ చేస్తారు. వీఆర్‌వోలు రెవెన్యూ రికార్డులు, ఆర్‌వోఆర్‌లోని వివరాలు పరిశీలిస్తారు. ఆర్‌వోఆర్ వివరాల్లో తేడాలు ఉంటే వెబ్‌ల్యాండ్‌లో సరిచేస్తారు. ఆ తర్వాతనే యూనిక్ ఐడీ వస్తుంది. కర్నూలు జిల్లాలో 29,441 మంది, నంద్యాల జిల్లాలో 25,237 మంది రైతుల ఆధార్ వివరాలతో ఆర్‌వోఆర్ వివరాల్లో తేడాలు ఉండటంతో వీఆర్‌వో లాగిన్‌కు పంపారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలను సంప్రదించి ఏపీఎఫ్ఆర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి సూచించారు.

# బర్డ్‌ఫ్లూ భయం

- కర్నూలులో ఈనెల 3,4 తేదీల్లో బాతులు మృతి
- ఆలస్యంగా స్పందించిన పశుసంవర్ధకశాఖ అధికారులు
- రెడ్‌జోన్‌లో చికెన్, గుడ్ల అమ్మకాల నిషేధం
- 35 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ల ఏర్పాటు
- జిల్లాలోని కోళ్ల ఫారాల్లో తనిఖీలు

బర్డ్‌ఫ్లూ నియంత్రణలో పశుసంవర్ధకశాఖ అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. కర్నూలులో పది రోజుల క్రితం ఉన్నట్టుండి 15 బాతులు మృతిచెందాయి. బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించాయి. రక్త నమూనాలు, శీరం తదితర శ్యాంపుల్ సేకరించి భోపాల్‌లోని హైసెక్యూరిటీ ల్యాబ్‌కు పంపి మౌనంగా ఉండిపోయారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోళ్ల పెద్ద ఎత్తున మరణించినప్పటికీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధికారులు చర్యలు తీసుకోలేదు. 'బర్డ్‌ఫ్లూ' వెలుగు చూడటంతో ప్రజలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా కేంద్రమైన కర్నూలులో బర్డ్‌ఫ్లూతో బాతులు మృతిచెందడం కలకలం రేపింది. అధికారుల్లో హడావుడి మొదలైంది. పశుసంవర్ధక శాఖతో పాటు రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖలు కూడా రంగంలోకి దిగాయి. బయో సెక్యూరిటీ మెజర్స్ అమలుపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కోళ్లు, బాతులు, ఇతర జాతి పక్షులు జిల్లాలోకి రవాణా కాకుండా నిఘా పెంచారు. పశు వైద్యాధికారులతో కర్నూలు డివిజన్‌లో 14, ఆదోని డివిజన్‌లో 21 ప్రకారం మొత్తం 35 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటయ్యాయి.

### కనిపించని మందులు

బర్డ్‌ఫ్లూతో బాతులు మృతిచెందడంతో కర్నూలులోని ఎన్ఆర్‌పేట చుట్టూ కిలోమీటరు పరిధిని రెడ్ అలర్ట్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. ఈ ప్రాంతంలో కోళ్లు, గుడ్ల అమ్మకాలపై నిషేధం విధించారు. ఎన్ఆర్ పేటకే ఐదు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటయ్యాయి. ఈ టీమ్‌ల్లోని పశువైద్య అధికారులు ఈ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. దుకాణాల్లో కోళ్లు, గుడ్లు అనేవి కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేశారు. అయితే పది రోజుల క్రితమే బాతులు బర్డ్‌ఫ్లూతో మృతి చెందాయి కదా.. అది ఏ స్థాయికి విస్తరించిందో అన్న భయాందోళనలు ప్రజలను వెంటాడుతున్నాయి. బర్డ్‌ఫ్లూ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి మందులు సరఫరా చేయలేదు. అయితే ఓ ప్రజా ప్రతినిధి నివాసంలోనే బాతులు మృతి చెందాయనే ప్రచారం జరుగుతోంది.

### కోళ్లలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఇవీ..

- → ముక్కు, కళ్ల వెంబడి నీరు కారుతుంది.
- → మెడ వాల్చడం, నీరసంగా ఉండడం కనిపిస్తుంది.
- → మచ్చలు ఏర్పడటం, విరేచనాలు ఎక్కువ కావడం గమనించవచ్చు.
- → వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు 24–48 గంటలలో కోళ్ల మృతిచెందుతాయి.



కర్నూలు ఎన్ఆర్‌పేటలో తనిఖీలు చేస్తున్న పశుసంవర్ధక శాఖ, మున్సిపల్ అధికారులు

### తనిఖీలు ముమ్మరం

కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎనిమిది కోళ్ల ఫారాలు ఉన్నాయి. వగరూరు, వెల్దుర్తి, కోడుమూరు మండలం ప్యాలకుర్తి, కృష్ణగిరి మండలం కోయిలకొండ, కర్నూలు మండలం గార్గేయపురం, దేవనకొండ మండలం నేలతలమర్రి, కుంకనూరు, దేవనకొండలో ఈ ఫారాలు ఉన్నాయి. వీటిల్లో 5,84,911 కోళ్లు ఉన్నాయి. కోళ్లఫారాలను ర్యాపిడ్ రెస్పాన్స్ బృంద సభ్యులు తనిఖీలు చేశారు. అనుమానాస్పద స్థితిలో కోళ్లు మృతిచెందితే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. కాగా.. కర్నూలులో 'బర్డ్‌ఫ్లూ' వెలుగు చూడటంతో ఒక్కసారిగా చికెన్, గుడ్ల అమ్మకాలు 50 శాతంపైగా పడిపోయినట్లు తెలుస్తోంది.

### జాగ్రత్తలు ఇవీ..

- ➤ బర్డ్‌ఫ్లూ వెలుగు చూడటంతో జిల్లా యంత్రాంగం బయో సెక్యూటరీ మెజర్స్‌పై దృష్టి సారించింది.
- ➤ కోళ్ల ఫారాల్లోకి ప్రజలను అనుమతించరు.
- ➤ కోళ్ల ఫారాల నిర్వాహకులు, డాక్టర్లు సైతం డెటాల్ నీళ్లలో కాళ్లు ముంచి వెళ్లాలి.
- ➤ పశువైద్యులు ఒక ఫారాన్ని తనిఖీ చేసిన తర్వాత మరో ఫారానికి వెళ్లరాదు.
- ➤ చికెన్, గుడ్లను 100 డిగ్రీల టెంపరేచర్‌లో ఉడికించి తినాలి.
- ➤ కోళ్లు, బాతులు, ఇతర జాతి పక్షులు మృతి చెందితే పశువైద్యులకు సమాచారం ఇవ్వాలి.
- ➤ పెరటి కోళ్ల పెంపకందారులు అధికారుల సూచనలు పాటించాలి.
- ➤ షెడ్డులో, పెరట్లో కోళ్ల ఆరోగ్యంలో తేడాలు ఎక్కువ శాతం ఉంటే పశువైద్య అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- ➤ కోడి మాంసం, గుడ్లను తిన్న వారికి జలుబు, దగ్గు, కండరాల నొప్పులు, గొంతునొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చమటలు పట్టడం, వాంతులు విరేచనాలు అవడం వంటి లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలి.
- ➤ మనుషుల నుంచి మనుషులకు బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందదు.



కర్నూలులోని ఓ వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న మునిసిపల్ సిబ్బంది

### ఆందోళన అవసరం లేదు



బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయినప్పటికీ జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెడ్ జోన్‌గా గుర్తించిన కర్నూలులోని ఎన్ఆర్ పేటలో చికెన్, గుడ్ల అమ్మకాలను బంద్ చేశాం. మిగిలిన ప్రాంతాల్లో చికెన్, గుడ్లను తినవచ్చు. అయితే 100 డిగ్రీల వేడిలో ఉడికించి తినాలి. 50 డిగ్రీల్లో ఉడికిస్తే వైరస్ మొత్తం చనిపోతుంది. 100 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికిస్తే ఎలాంటి ప్రమాదం లేదు. పాజిటివ్ కేసు వచ్చినందున బయో సెక్యూరిటీ మెజర్స్‌ను పాటిస్తున్నాం. కోళ్లు, బాతులు మృతిచెందితే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

–జి.శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

## ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు



జొన్నలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో తెల్లజొన్నలకు రసాయన మందులు కలిపి పచ్చజొన్నలుగా మార్పు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు షేక్ ఖాసీంవలి, వెంకటరాముడు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మార్కెట్‌యార్డు ఆవరణలో ఉంచిన పచ్చజొన్నల నాణ్యతను పరిశీలించి, పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించారు. రిపోర్టు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు. కల్తీ జరిగినట్లు భావించే జొన్నలు శ్రీ లక్ష్మీ వెంకటరాఘవేంద్ర ట్రేడర్స్‌కు చెందినవిగా గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఇన్‌చార్జ్ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఐశ్వర్యారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఐశ్వర్యారెడ్డి సూచించారు. శుక్రవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా నంద్యాల ద్విచక్ర వాహన డీలర్లు, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ప్రైవేటు లిమిటెడ్ చాపిరేవుల టోల్‌ప్లాజా (జాతీయ రహదారుల సంస్థ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హెల్మెంట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను ద్విచక్ర వాహన చోదకులకు వివరిస్తూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు కార్యక్రమంలో నంద్యాల ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ మధన్‌మోహన్, రూట్ మేనేజర్ సర్వేస్‌రెడ్డి, పారా మెడికల్స్, అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్లను అశ్రద్ధ చేయొద్దు

- విద్యార్థులతో మంత్రి ఎన్ఎండీ ఫరూక్



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: విద్యార్థులు కళ్లను అశ్రద్ధ చేయరాదని, ఎక్కువగా సెల్‌ఫోన్లు చూడకూడదని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. శుక్రవారం నంద్యాల క్రాంతినగర్‌లోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులందరికీ ప్రభుత్వం కంటి పరీక్షలు నిర్వహించి లోపాలు ఉన్న విద్యార్థులకు ఉచితంగా అద్దాలు అందజేస్తుందన్నారు. అయితే, చిన్నవయస్సులోనే విద్యార్థుల చూపు మందగిస్తుండటం బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ కంటి చూపును పెంచుకోవడంపై దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులు కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండి ఏ విటమిన్ గల ఆహార పదార్థాలు, ఆకుకూరలు, పప్పు దినుసులు, గుడ్లు, పాలు, పండ్లు, చేపలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో కంటి సమస్యలు ఉన్న 44 మంది విద్యార్థులకు కంటి అద్దాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటపాటల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ, డాక్టర్ మాధవీలత, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సీసీలియా తదితరులు పాల్గొన్నారు.



## వీర జవాన్లు..మీకు జోహార్లు

పుల్వామా దాడిలో అసువులు బాసిన భారత వీర జవాన్లకు శుక్రవారం ఆత్మకూరు మండలం బైర్లూటీ గూడెం గిరిజన పాఠశాలలో విద్యార్థులు నివాళులర్పించారు. మహిళా పోలీసు మైమున్నీసాబేగం ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలను ప్రదర్శించారు. ఆరేళ్ల క్రితం 2019 ఫిబ్రవరి 14వ తేదీన దేశ సరిహద్దులోని జమ్మూకాశ్మీర్ పుల్వామా జిల్లాలో భారత సైనికుల వాహనంపై ఉగ్రదాడి జరగడంతో 40 మంది జవాన్లు మృతి చెందారని, ఇది చాలా బాధాకర సంఘటన అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వీరజవాన్లకు నివాళులర్పించిన వారిలో ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్ యాజమాన్య,ం సర్పంచ్ గురవమ్మ, ఆర్.శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

–ఆత్మకూరు

## జనరిక్ మెడికల్ షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): 2024–25 సంవత్సరం జిల్లాలోని బీసీ, ఈబీసీ, కమ్మ,రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన లబ్ధిదారులు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు జాకీర్‌హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దుకాణాల ఏర్పాటుకు 21సంవత్సరాల నుంచి 60ఏళ్ల వయస్సు వారు అర్హులని, తెల్ల రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు కలిగి ఉండాలని చెప్పారు. బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ సర్టిఫికెట్లు కావాలని చెప్పారు. అర్హత ఉన్న వారు వెబ్‌సైట్ https://apobmms.apcfss.inలో నమోదు చేసుకోవాలన్నారు.

## అనుసరణీయులు సంజీవయ్య



దామోదరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, దళిత సంఘాల నాయకులు

- దామోదరం సంజీవయ్య జయంతి వేడుకల్లో కలెక్టర్

నంద్యాల: పేదల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ దామోదరం సంజీవయ్య అనుసరణీయులని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్, దళిత సంఘాల నాయకుల పాల్గొన్న ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సంజీవయ్య దళిత కుటుంబంలో జన్మించి రాష్ట్ర, జాతీయ స్థాయి రాజకీయాల్లో రాణించి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. పేద ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి అమలుకు కృషి చేశారని కొనియాడారు. జిల్లాలో గాజులదిన్నె ప్రాజెక్టు, వరదరాజస్వామి గుడి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చేశారన్నారు. కార్మిక శాఖ మంత్రిగా కార్మికుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. నీతి, నిజాయితీ, స్వశక్తితో ఉన్నత పదవులను అధిరోహించి స్ఫూర్తిదాయకమైన వ్యక్తిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం వచ్చిన తర్వాత దళితుల హక్కుల కోసం పోరాడిన తొలి వ్యక్తి దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. అంతకుముందు దళిత సంఘాల నాయకులు దళితుల సంక్షేమం కోసం సంజీవయ్య అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవికాంత్ బాబు, కాసన్న, రమేష్ నాయక్, బాల నాగన్న, మురళీ, దళిత సంఘాల నాయకులు కొమ్ము పాలెం శ్రీనివాస్, సతీష్ కుమార్, దండు వీరయ్య, చిటికెల సలోమి, సఫాయి కర్మచార కమిటీ సభ్యులు చెన్నమ్మ, మహేశ్వరమ్మ, రవికుమార్ పాల్గొన్నారు.

# తాగు..ఊగు!

- జిల్లాలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- నిబంధనలు బేఖాతరు
- బార్‌లను తలపిస్తున్న వైన్‌షాప్‌లు
- అక్కడే వాటర్ ప్యాకెట్లు, స్నాక్స్ అమ్మకాలు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు



మద్యం దుకాణం వద్దే వాటర్, స్నాక్స్ విక్రయాలు



ఓ వైన్ షాపు వద్ద మద్యం సేవిస్తున్న మందుబాబులు

బొమ్మలసత్రం: సామాన్యుడిని ఆర్థికంగా చిన్నాభిన్నం చేసే, సామాజికంగా అనేక సమస్యలు తెచ్చి పెట్టే మద్యాన్ని జనానికి దూరంగా ఉంచాలని గత ప్రభుత్వం ఆలోచించింది. ఇందుకు తగ్గట్టుగానే జనావాసాలకు దూరంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. ప్రైవేట్ దుకాణాల వారు లాభాపేక్షతో పేదలను పిండుకుంటారన్న ఆలోచనతో సొంతంగా దుకాణాలు నడిపింది. నిర్ణీత వేళల్లో మాత్రమే మద్యం అందుబాటులో ఉంచేలా చేయడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా బెల్టు షాపులు లేకుండా చేసింది. నాటుసారా వ్యాపారులపై పీడీయాక్ట్ నమోదు చేసి వారు ఆ దందాను స్వస్తిపలికేలా చేసింది. ఇలాంటి చర్యలతో తమ భర్తలు మద్యం మానేస్తున్నారని కొందరు, నాటుసారా జోలికి వెళ్లకుండా ఆరోగ్యంగా ఉన్నారని ఇంకొందరు పేదింటి మహిళలు నాడు సంతోషం వ్యక్తం చేసేవారు. ఎనిమిదినెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుంది. మద్యాన్ని ఏరులై పారిస్తోంది. ఆదాయం కోసం ఎక్కడ పడితే అక్కడ వైన్‌షాపుల ఏర్పాటుకు లైసెన్స్ జారీ చేసింది. దీంతో జిల్లాలో ప్రస్తుతం కల్లుగీత కార్మికులకు కేటాయించిన 11 మద్యం దుకాణాలతో కలుపుకొని 116 వైన్‌షాపులు, 22 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయి. ఇందులో అత్యధిక మద్యం దుకాణాలు కూటమి నాయకులు, వారి అనుచరుల చేతిలోనే ఉన్నాయి.

### బార్‌లను తలపిస్తున్న వైన్‌షాపులు

నిబంధనల ప్రకారం వైన్‌షాపుల వద్ద మద్యం సేవించరాదు. కేవలం అక్కడ మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్లాలి. అయితే, ఈ దుకాణాల వద్దే నిర్వాహకులు మద్యం తాగేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. వాటర్ ప్యాకెట్లు, స్నాక్స్ కూడా అక్కడే విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని ప్రాంతాల్లో వైన్‌షాప్‌ల వద్ద ఈ తతంగం నడుస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


### దిక్కుతోచని స్థితిలో బార్‌యజమానులు

గత ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించ కుండా గట్టి చర్యలు తీసుకుంది. వైన్‌షాప్‌ల వద్ద మద్యం సేవించినా లేదా బెల్టుషాపులు నిర్వహించిన పోలీసులు కఠిన చర్యలు తీసుకునే వారు. జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకురావాలన్నా పోలీసుల చర్యలకు భయపడి మిన్నకుండి పోయేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆదాయం కోసం వైన్‌షాప్‌ల సంఖ్యను అమాంతం పెంచటమే కాకుండా కూటమి నేతలతో బెల్టు షాపులు నెలకొల్పింది. ఇవే కాకుండా గత ప్రభుత్వ చర్యలతో కనిపించకుండా పోయినా నాటుసారాను తిరిగి తీసుకొచ్చారు. ఊర్లలో ఎక్కడ పడితే అక్కడ నాటుసారా తయారు చేసి విక్రయాలు చేపట్టారు. ఈ కల్తీ సారా తాగి కొందరు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ అధికారులు వారి కార్యాలయాలకు వెళ్లే దారిలో వైన్ షాపులున్నాయి. అక్కడ ఆ దుకాణాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసి బాహాటంగా మద్యం తాగిస్తున్నారు. ఇలా ఎక్కడ పడితే అక్కడ మద్యం, నాటుసారా లభించడం, తాగేందుకు అవకాశం కల్పించడంతో బార్‌లకు వెళ్లి మద్యం తాగే వారి సంఖ్య తగ్గిపోయింది. దీంతో వ్యాపారం లేక ఏం చేయాలో తెలియక వాటి యజమానులు దిక్కులు చూస్తున్నారు.

### మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వాహణను తొలగిస్తూ కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతికి దుకాణాలు అప్పజెప్పినప్పటి నుంచి ఎక్సైజ్ అధికారులకు కాసుల వర్షం కురుస్తుంది. దుకాణాల ఏర్పాటు నుంచి నేటి వరకూ మామూళ్లతోనే కొందరు అధికారులు పబ్బం గడుపుతున్నారు. వైన్‌షాప్‌ల యజమానుల నుంచి లైసెన్స్ ఆక్టివేషన్ పేరుతో ఒక్కో నిర్వాహకుని నుంచి రూ.1 లక్ష వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇవే కాకుండా ఒక్కో వైన్‌షాప్ నుంచి ప్ర తి నెల రూ. 45 వేలు వసూలు చేస్తున్నారు. ఇక బార్ యజమానుల నుంచి ఎస్టీఎఫ్ అధికారుల పేరుతో ప్రతి నెల రూ. 12 వేలు, డీటీఎఫ్ అధికారుల పేరుతో రూ. 15 వేలు లోకల్ ఎక్సైజ్ పోలీస్టేషన్‌కు రూ. 30 వేల మేర వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇవే కాకుండా బార్, వైన్ షాప్‌ల పరిధిలోని పోలీస్టేషన్‌లకు రూ. 12 వేలు ప్రతి నెల ముట్టజెప్పాలి. ఇలా మామూళ్లు అందటంతోనే అధికారు లు వైన్‌షాప్‌ల వైపు కన్నెత్తి చూడటంలేదనే విమర్శలు న్నాయి.

### వైన్‌షాప్‌ల వద్ద మద్యం తాగితే చర్యలు



కొందరు వైన్‌షాపుల యజమా నులు దుకాణాల వద్ద మద్యం తాగిస్తున్నారని ఫిర్యాదులు వస్తు న్నాయి. అలాంటి దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. వైన్‌షాప్‌ల వద్ద మద్యం తాగించటంతో పాటు వాటర్ ప్యా కెట్లు, స్నాక్స్ విక్రయాలు చట్టరీత్య నేరం. అలాంటి దుకాణాలపై చర్యలు తీసుకుంటాం.

– కృష్ణమూర్తి, ఎక్సైజ్ సీఐ, నంద్యాల

## క్లుప్తంగా

### మోటార్ సైకిళ్లు ఢీ.. ఒకరు మృతి

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరు గ్రామ సమీపంలో శుక్రవారం రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల మండలం బోయలకుంట్లకు చెందిన నాగేశ్వరరావు (56) ఓ పంచాయితీ నిమిత్తం మండల కేంద్రమైన రుద్రవరానికి వెళ్లాడు. అక్కడ పనులు పూర్తి కాగానే తిరిగి మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. శిరివెళ్లకు చెందిన నూర్‌బాషా చిన్నకంబలూరు వైపు తాపీ మేస్త్రీ పనులు ముగించుకొని మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఆ క్రమంలో చిన్నకంబలూరు గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ఆ రెడు బైక్‌లు ఎదురెదురై ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షత గా త్రులను చికిత్స నిమిత్తం 108వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసుమోదు చేసి విచారణ చేపట్టినట్లు వారు తెలిపారు.

### లభించని బాలుడి ఆచూకీ



కాలువలో గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

పత్తికొండ రూరల్: హంద్రీ–నీవా కాలువలో గురువారం గల్లంతైన 12 ఏళ్ల బాలుడు తులసీగౌడు ఆచూకీ శుక్రవారం కూడా దొరకలేదు. ఎపీఎస్‌డీఆర్‌ఎఫ్‌కు చెందిన 15 మంది సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ జయన్న తెలిపారు. డోన్‌కు చెందిన దామోదర్‌గౌడు, రాజేశ్వరి దంపతుల కుమారుడు తులసీగౌడ్. పందికోన సమీపంలోని హంద్రీ–నీవా కాలువలో గల్లంతైన విషయం తెలిసిందే. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో బాలుడి ఆచూకీ శుక్రవారం సాయంత్రం వరకు లభించలేదు.

### హుండీ చోరీ యత్నం

వెల్దుర్తి: గుడిలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. హైవే పోలీసుల పహారాతో హుండీ, బైక్ వదిలి పారిపోయారు. వివరాలు ఇవీ.. గురువారం రాత్రి ఇద్దరు యువకులైన దొంగలు మండల పరిధిలోని హైవే 44ను అనుకుని ఉన్న మదార్‌పురం గ్రామ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి గుడి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా ఇతరత్రా అల్మారాలు తెరిచి విలువైన వస్తువుల కోసం వెతికారు. గుడిలో హుండీ తాళం పగులగొట్టి తెరిచే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. బయటకు తీసుకెళ్లి దూరంగా వెళ్లి తెరుచుకునే ప్రయత్నం చేద్దామన్న ఆలోచనతో బైక్‌పై హుండీతో బయలుదేరారు. అదే సమయంలో పహారాలో ఉన్న హైవే పోలీసుల కంట పడ్డారు. హైవే కానిస్టేబుల్ శేఖర్, సిబ్బంది తమ వాహనంలో దొంగల వెంట పడ్డారు. దీంతో దొంగలు హుండీని, బైక్‌ను బొమ్మిరెడ్డిపల్లె వద్ద వదిలేసి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అశోక్, సిబ్బంది హుటాహుటిన బయలుదేరి దొంగల కోసం గాలించారు. హుండీని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుడిలోపలి సీసీ కెమెరాలో దొంగలు హుండీ తెరిచే ప్రయత్నం, ఎత్తుకెళ్లడం రికార్డయ్యాయి. సీసీ ఫుటేజీ సేకరించి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



## ఆసక్తి చదివిస్తోంది!

వీరు తువ్వపల్లె తిప్ప మీదున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు. ఇంగ్లిషు భాషపై పట్టు పెంచుకునేందుకు ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తారు. గ్రూపులుగా ఏర్పడి వివిధ అంశాల గురించి ఇంగ్లిషులో రాయడం, చదవడం, మాట్లాడటం, చర్చించడం వంటివి చేస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం ఇలా రౌండ్‌గా కూర్చొని ఇంగ్లిషు పత్రికలను చదువుతూ కనిపించారు. బయట ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు, వివిధ అంశాలపై అవగాహన పెంచుకునేందుకు విద్యార్థులకు దినపత్రికలు చదవడం అలవాటు చేసినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. – రుద్రవరం

## ఇంట్లో చెట్టు... బయట కొమ్మలు

ఎప్పుడో ఆరు దశాబ్దాల క్రితం కోస్తా ప్రాంతం నుంచి కొందరు దొర్నిపాడు మండలానికి వలస వచ్చి ఇక్కడ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రామచంద్రాపురం గ్రామంలో చాలా మంది సువిశాలమైన స్థలాల్లో గుడిసెలు, ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. బబ్బూరి వెంకటస్వామి అనే ఓ వ్యక్తి స్థలంలో పెద్ద వేప చెట్టు ఉంది. దానిని తొలగించడం ఇష్టంలేని సదరు వ్యక్తి కుటుంబం గృహ నిర్మాణాన్ని సైతం ఆ చెట్టు చుట్టే చేపట్టింది. లోపల చెట్టు మొదలు, బయట కొమ్మలు కనిపించేలా నిర్మించిన ఈ గూడు గ్రామంలో ప్రత్యేకంగా కనిపిస్తోంది. చెట్లపై మక్కువతోనే తాము ఇలా చేశామని, కొమ్మలు పైన ఉండటంతో వేసవిలో వేడి నుంచి ఉపశమనం లభిస్తుందని ఇంటి యజమాని పేర్కొన్నారు. – దొర్నిపాడు





## నేడు, రేపు వైద్య విజ్ఞాన సదస్సు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాల అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15, 16వ తేదీన వైద్య విజ్ఞాన సదస్సు, అలుమ్ని మీట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బి.కుమారస్వామి రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మొదటి రోజు పూర్వ వైద్య విద్యార్థులు, సీనియర్ పార్లమెంటేరియన్ డాక్టర్ ఎం.వి.మైసూరా రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ బి.ఎల్.రవీంద్రారెడ్డి, రిటైర్డ్ డీజీపీ డాక్టర్ టి.నాయక్ తదితరులు హాజరవుతున్నారన్నారు. రెండు రోజులు కర్నూలు మెడికల్ కళాశాలలో చదివి ప్రస్తుతం దేశ విదేశాల్లో ఆయా స్పెషాలిటీల్లో పేరు, ప్రఖ్యాతలు గడించిన స్పెషలిస్టులు వస్తున్నారని, వారు వారి స్పెషాలిటీలో వచ్చిన నూతన వైద్య విధానాలను వైద్యులకు వివరిస్తారని తెలిపారు.

### హౌసింగ్ ఈఈగా వెంకటదాసు

కర్నూలు(అర్బన్): జిల్లా గృహ నిర్మాణ సంస్థ కర్నూలు ఈఈగా పీ వెంకటదాసు శుక్రవారం హౌసింగ్ జిల్లా అధికారి అజయ్‌కుమార్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా మదనపల్లె నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. గత ఏడాదిన్నర కాలంగా రెగ్యులర్ ఈఈ లేకపోవడం వల్ల కర్నూలు అర్బన్ డీఈఈ ప్రభాకర్ ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ఈఈగా బాధ్యతలు నిర్వహిస్తు వచ్చారు.

### ప్రత్యేక ప్యాకేజీతో కుంభమేళా టూర్

కర్నూలు కల్చరల్: ఏపీ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రయాగ్రాజ్ మహా కుంభమేళాకు ప్రత్యేక ప్యాకేజీతో టూర్ ఏర్పాటు చేశారు. ఈనెల 17వ తేదీన తిరుపతి నుంచి ఏసీ వోల్వో (45 సీటర్స్) బస్సు బయలు దేరుతుంది. తిరుపతి, ఒంటిమిట్ట, ఓర్వకల్లు, కర్నూలు, హైదరాబాద్, బాసర, వారణాశి, ప్రయాగరాజ్ చేరుకుంటుంది. తిరిగి జబల్‌పూర్, హైదరాబాద్, కర్నూలు, మహానంది మీదుగా బస్సు తిరుపతి చేరుకుంటుంది. ఈ బస్సు 17వ తేదీ మధ్యాహ్నం 1.15 గంటలకు ఓర్వకల్లు, 2.15 గంటలకు కర్నూలు నుంచి బయలు దేరుతుంది. వారం రోజుల పాటు ఈ టూర్ ఉంటుంది. పెద్దలకు (10 సంవత్సరాలు పైబడిన వారు) రూ.20 వేలు, 3 నుంచి 9 సంవత్సరాల వయస్సు పిల్లలకు రూ.17,200 టికెట్ ధర నిర్ణయించారు. వివరాలకు 90101 77055ను సంప్రదించవచ్చు.

### ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్‌గా రమణ

సాక్షి, అమరావతి: ఇంధన శాఖలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ విభాగానికి కర్నూలు ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్‌గా వై. వెంకట రమణను ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రస్తుతం కాకినాడ విద్యుత్ భద్రత విభాగంలో డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు. పదోన్నతిపై రమణను బదిలీ చేస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ఏపీఈడబ్ల్యూఐడీసీ నంద్యాల ఈఈగా నాగరాజు

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమం మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ ) నంద్యాల ఈఈగా గోన నాగరాజు నియమితులయ్యారు. కర్నూలు డీఈఈగా ఉన్న ఈయనకు నంద్యాల ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సంస్థ ఎండీ దీవన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కర్నూలు ఈఈ లక్ష్మీనారాయణ నంద్యాల ఈఈగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నంద్యాల ఈఈగా బాధ్యతలు స్వీకరించనున్న నాగరాజును పలువురు ఉద్యోగులు అభినందించారు. కార్యక్రమంలో కార్యాలయ డీఈఈ వీరయ్య, ఏఈలు మధు, హరీష్, సురేంద్ర, ప్రవీణ్, మోయిద్దీన్‌ఖాన్, ప్రభాకర్‌రావు, డీపీఓ షబానా, డీఈఓ నాగేంద్ర, సిబ్బంది బాలయ్య, సుబ్బుడు తదితరులు పాల్గొన్నారు.

## రూపాయి ఖర్చు లేకుండా కేసుల పరిష్కారం

- శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్

కర్నూలు: శాశ్వత లోక్ అదాలత్‌తో ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏవైనా కేసులను పరిష్కరించుకోవచ్చని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ అన్నారు. సత్వరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించిన కేసు వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన జి.మల్లికార్జున రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ(వాది)కి అనంతపూర్‌లో ఇండస్ ఇండ్ బ్యాంకు(ప్రతివాది)లో అకౌంట్ ఉందని తెలిపారు. తన ఎల్ఐసీ బాండ్‌ను ఇండస్ ఇండ్ బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం పొంది, తిరిగి చెల్లించారన్నారు. ఎల్ఐసీ బాండ్ 2023 సెప్టెంబర్‌లో మెచ్యూర్ కాగా.. మొత్తం చెల్లింపు కోసం అసలు ఎల్ఐసీ బాండ్‌ను సమర్పించాలని అధికారులు కోరారన్నారు. ఎల్ఐసీ బాండ్ ఇవ్వాలని బ్యాంకును అడగగా తిరిగి ఇవ్వకపోవడంతో శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించారని తెలిపారు. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చి ఇరు వర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించామన్నారు. ఇండస్ ఇండ్ బ్యాంకు (ప్రతివాది) డీడీ ద్వారా రూ.10 వేల మొత్తాన్ని శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజు బాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు జి.నాగేశ్వరయ్య, సి.లోకేశ్వరయ్య సమక్షంలో వాది జి.మల్లికార్జునకు అందజేశారని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం జరిగితే అటువంటి తీర్పుపై అప్పీలు లేదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## బ్యాంకుల సమ్మెను విజయవంతం చేద్దాం

- యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ డిమాండ్



స్టేట్‌బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు

కర్నూలు (అగ్రికల్చర్): వచ్చే నెల 24, 25 తేదీల్లో చేపట్టే ఆలిండియా బ్యాంకుల సమ్మెను విజయవంతం చేయాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదుట ముందస్తుగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పలు దఫాలుగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో సమ్మెకు దిగినట్లు పేర్కొన్నారు. అన్ని బ్యాంకుల్లో పని ఒత్తిడి తగ్గించేందుకు తగిన స్థాయిలో నియామకాలు చేపట్టాలని, ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలను తక్షణం పరిష్కరించాలని, ఔట్ సోర్సింగ్‌పై ఉద్యోగ నియామకాలను బంద్ చేయాలని కోరారు. వివిధ డిమాండ్లను సాధించుకునేందుకు చేపట్టిన రెండు రోజుల బ్యాంకుల సమ్మెను అన్ని బ్యాంకుల ఉద్యోగ సంఘాలు కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ నాయకులు శివకృష్ణ, ఎల్లయ్య, అనిల్‌రెడ్డి, ఏఐబీఓసీ నాయకులు రహిమాన్, మురళీకృష్ణ, అనిల్, ఎన్‌సీబీఈ నాయకులు విద్యాసాగర్, శ్రీకాంత్, ఏపీజీబీ యూనియన్ నాయకులు హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



దామోదరం సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు (టౌన్): నిజాయితీకి, నిరాడంబరత్వానికి దామోదరం సంజీవయ్య నిలువెత్తు నిదర్శనం అని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎస్పీ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా సేవలు అందించారన్నారు. చిన్న వయస్సులోనే ముఖ్యమంత్రి పదవిని అలంకరించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రజా సంక్షేమం అమలులో అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

## 16న నరసం రాష్ట్ర సదస్సు

కర్నూలు కల్చరల్: నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) సాహితీ సదస్సు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నరసం 7వ వార్షికోత్సవ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు నరసం జిల్లా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రచయిత్రులు అందరూ ఒక వేదికపైకి రావాలి, రచనా సామర్థ్యాన్ని మెరుగు పరుచుకోవాలి, సమకాలీన సమస్యలపై స్పందించి రచనలు చేసి మంచి సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో నరసం ముందుకు సాగుతుందన్నారు. విద్యార్థుల్లో రచనా శక్తిని, సృజనాత్మకతను పెంచేలా నరసం పనిచేస్తుందన్నారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు ప్రారంభ సభ ఉంటుందన్నారు. ఐదు సెషన్‌లు కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. కవిసమ్మేళనాలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సుమారు 40 మంది ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన కయిత్రులు, రచయిత్రులు కవిసమ్మేళనాల్లో పాల్గొంటారన్నారు. సమావేశంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ, నరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నరసం ప్రతినిధులు

## డీసీసీ అధ్యక్షుడిగా మురళీకృష్ణ తొలగింపు

కర్నూలు కల్చరల్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి నుంచి పరిగెల మురళీకృష్ణను తొలగిస్తూ పీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిలా రెడ్డి ప్రకటించారు. మురళీ కృష్ణ డీసీసీ ఆఫీస్ ప్రాపర్టీని మెయింటేన్ చేయడానికి ఎలాంటి అనుమతి లేకుండా సొంతంగా సొసైటీని రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సీడబ్ల్యూసీ నేత గిడుగు రుద్రరాజు విచారణలో అంతా వాస్తవమేనని తేలడంతో డీసీసీ అధ్యక్ష పదవి నుంచి మురళీకృష్ణను తొలగించినట్లు తెలిపారు.

## హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు

- అనంతపురం, నంద్యాల జిల్లాల వృషభాలకు మొదటి, ద్వితీయ బహుమతి



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ

మద్దికెర: శ్రీ మద్దమాంబ రథోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన మద్దికెరలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు నిర్వహించారు. పోటీలను ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్, ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని ప్రారంభించారు. గుంతకల్లు రహదారిలో ఉన్న మైదానంలో నిర్వహించిన పోటీలు ఉదయం నుంచి ఉత్కంఠ భరితంగా సాగాయి. అనంతపురం జిల్లా ఎ. నారాయణపురం గ్రామానికి చెందిన షేక్ మహుద్ బాషా ఎద్దులు మొదటి, నంద్యాల జిల్లా పీఆర్ ఎం.నాగయ్య ఎద్దులు రెండో, అనంతపురం జిల్లా మెడికాలపల్లె తిరుపాల్ రెడ్డి ఎద్దులు మూడో, నంద్యాల జిల్లా సయ్యద్ కాలామ్ బాషా ఎద్దులు నాల్గో, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన ఎద్దులు ఐదో స్థానంలో నిలిచాయి. వృషభాల యజమానులకు బహుమతులను నిర్వాహకులు మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, కిట్టి, ఖాజావలి అందజేశారు.



## రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థిని దుర్మరణం

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థిని మృతిచెందగా..మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బలపనూరు గ్రామానికి చెందిన బి. మహేశ్వరరెడ్డి, కుమార్తె వైష్ణవి, అదే గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి పెద్ద కుమార్తె వై. రామ పూజిత(16) నంద్యాల సమీపంలోని ఓ ప్రయివేట్ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. వై. పూజిత హాస్టల్‌లో ఉంటుండగా వైష్ణవి రెగ్యులర్‌గా కాలేజీకి వెళ్లి వస్తుంటుంది. పూజిత బంధువుల ఇంట్లో శుభకార్యం ఉంది. దీంతో శుక్రవారం రాత్రి మహేశ్వరరెడ్డి స్కూటీపై వైష్ణవితో కలిసి ఆబాలిక కాలేజీ నుంచి బయలుదేరిండి.బలపనూరు గ్రామం వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కర్నూల్ వైపు వెళ్తున్న మినీట్రాలీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్త స్థానికులు శాంతిరామ్ ఆసుపత్రికి తరలించగా పూజిత కోలుకోలేక మృతి చెందారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## పోస్టల్ ఆర్‌డీ సొమ్ము స్వాహా

- పోస్టుమాస్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఆత్మకూరు: మండలంలోని వడ్లరామాపురం గ్రామస్తులకు పోస్టుమాస్టర్ టోకరా వేసి నగదు స్వాహా చేశాడు. ఆలస్యంగా తెలుసుకున్న ఖాతాదారులు పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే..వడ్లరామాపురం పోస్టుమాస్టర్‌గా ముస్తఫా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలో పలువురు పోస్టల్ ఖాతా తెరిచి ఆర్‌డీలు, ఇన్సూరెన్స్ చేశారు. నెలనెలా వారు చెల్లించే సొమ్మును పోస్టుమాస్టర్ ఖాతాలో జమ చేయకుండా స్వాహా చేశాడు. ఖాతాదారులకు అనుమానం రాకుండా వారి పుస్తకంలో నమోదు చేశాడు. ఐదేళ్ల దాటడంతో తమ పొదుపు సొమ్ము ఇవ్వాలని ఖాతాదారులు అడగగా పోస్టుమాస్టర్ ఇవ్వకుండా నేడు..రేపు అనుకుంటూ వస్తున్నాడు. తమ డబ్బు ముస్తఫా కాజేశాడని తెలుసుకొని పలువురు శుక్రవారం ఆత్మకూరు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డికి కలిసి ఫిర్యాదు చేశారు. సుగులూరు సుబ్బన్న రూ.70 వేలు, రత్నస్వామి రూ.2.20 లక్షలు, సముద్రం భాగ్యమ్మ రూ.50 వేలు, చెంచెన్న రూ.లక్ష, దేవరాజు రూ.90 వేలు, లలితమ్మ రూ.40 వేలు, వసుంధర రూ.20 వేలు, సీతమ్మ రూ.90 వేలు, చెన్నారెడ్డిగారి సుబ్బమ్మ రూ.2.14 లక్షలు, గుర్రం సావిత్రమ్మ రూ.1.20 లక్షలు, శేషిరెడ్డి రూ.80 వేలు, ప్రశాంతి రూ.32 వేలు, దేవరాజు రూ.10 వేలు, సుంకన్న రూ.43 వేలు చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోస్టుమాస్టర్‌ను విచారిస్తున్నామని త్వరలో వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.



## మద్యం షాపు తొలగించక పోతే ఉద్యమిస్తాం



ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న 28వ వార్డు ప్రజలు, సీపీఐ నాయకులు

నందికొట్కూరు: తాలూకా ఆఫీస్ రోడ్డులో ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును వెంటనే తొలగించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని 28వ వార్డు ప్రజలు, సీపీఐ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ శాఖ, రెవెన్యూ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుతో మహిళలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. అనంతరం ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్‌కు, తహసీల్దార్ శ్రీనివాసులుకు మద్యం దుకాణం తొలగించాలంటూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు



డీఎస్పీ నాగరాజు (ఫైల్)

ఆస్పరి: రాజమహేంద్ర వరంలో మృతి చెందిన సీఐడీ డీఎస్పీ బి. నాగరాజు అంత్యక్రియలు శుక్రవారం స్వగ్రామమైన ఆస్పరిలో పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. ఈయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. డీఎస్పీ మృతదేహానికి డీఎస్పీలు నరిసిరెడ్డి, నాగరాజుయాదవ్, దైవప్రసాద్, ఉపేంద్ర, ఆస్పరి సీఐ మస్తాన్‌వలి, పోలీసులు, బంధువులు, మిత్రులు అధిక సంఖ్యలో వచ్చి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతదేహన్ని మేళతాళాలతో ఊరేగించారు. డీఎస్పీ సొంత పొలంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పోలీసులు తుపాలకులతో గౌరవ వందనం చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.



తుపాకులతో గౌరవ వందనం చేస్తున్న దృశ్యం

## మహిళకు అరుదైన గుర్రపునాడా కిడ్నీ సమస్య

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా అందరికీ రెండు కిడ్నీలు విడివిడిగా ఉంటాయి. కానీ అత్యంత అరుదుగా కొందరికి మాత్రం రెండు కిడ్నీలు గుర్రపు నాడా ఆకారంలో ఉండి, కింది భాగం కలిసిపోయి ఉంటాయి. కర్నూలులోని ఓ మహిళకు అలాంటి కిడ్నీలు ఉండి ఒక కిడ్నీ పూర్తిగా దెబ్బతింది. దీంతో దానిని వైద్యులు ల్యాప్కోస్కోపిక్ విధానంలో ఆపరేషన్ చేసి తొలగించారు. శుక్రవారం వివరాలను కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో యురాలజిస్టు డాక్టర్ వై. మనోజ్ కుమార్ వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే... 'కర్నూలు మండలం పడిదెంపాడు గ్రామానికి చెందిన ఎం. లక్ష్మీదేవి(50)కి పుట్టుకతో కిడ్నీలు గుర్రపునాడా ఆకారంలో ఏర్పడ్డాయి. ఇంతకాలం వాటితో ఎలాంటి ఇబ్బంది రాలేదు. కానీ కొంత కాలంగా ఆమె తీవ్రమైన కడుపునొప్పి, మధ్యమధ్యలో జ్వరం లాంటి లక్షణాలతో బాధపడ్డారు. ఈ సమస్యలతో గత జనవరి 21వ తేదీన ఆమె కిమ్స్ హాస్పిటల్‌కు వచ్చారు. పరీక్షించగా ఆమెకు గుర్రపునాడా కిడ్నీలలో కుడివైపుది బాగా వాపు వచ్చి పాడైపోయి, కిడ్నీసైజు పెద్దగా మారినట్లు గుర్తించాం. ఆమెకు మరుసటి రోజున ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో పాడైన కిడ్నీని జాగ్రత్తగా తొలగించాం. దాదాపు రెండున్నర గంటల సమయం పట్టింది. ఎలాంటి ఇబ్బందులు లేకపోవడం, రక్తస్రావం కూడా వీలైనంత తక్కువగా ఉండటంతో ఆమె త్వరగా కోలుకుంది. దీంతో ఆమెను అదే నెల 26న డిశ్చార్జ్ చేశాం. తిరిగి ఆమె వైద్యసేవల కోసం శుక్రవారం రాగా పరీక్షించి ఆపరేషన్ విజయవంతం అయ్యిందని నిర్ధారించుకున్నాం' అని డాక్టర్ వివరించారు.